క్లుప్తంగా

నేడు పంచాంగ శ్రవణం

ఎంవీపీకాలనీ: తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 30న ఉగాదిని పురస్కరించుకుని విశ్వావసు నామ సంవత్సర పంచాంగ శ్రవణం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంవీపీ కాలనీలోని హెచ్‌డీపీ కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. ఎంవీపీ కాలనీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ కార్యాలయంతోపాటు అనకాపల్లి జిల్లా పాపయ్యపాలెంలోని శ్రీరామాలయం, అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలంలోని సింగరాళ్లపాడు గ్రామంలో ఆదివారం ఈ కార్యక్రమం జరగనుందని తెలిపింది.

కాలభైరవుడికి పూజలు



కాలభైరవస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

మద్దిలపాలెం: కొత్త వెంకోజీపాలెం గౌరీ జ్ఞాన లింగేశ్వరాలయంలో కాలభైరవ స్వామికి అమావాస్య సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి మకర తోరణాన్ని అలంకరించారు. ఆలయ అర్చకులు ప్రకాష్ శర్మ, సుబ్రహ్మణ్యశాస్త్రి, భాస్కరశర్మల ఆధ్వర్యంలో భక్తుల పేరిట అభిషేకాలు, అర్చనలు జరిపారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- మరో యువకుడికి తీవ్ర గాయాలు



డివైడర్‌ను ఢీకొట్టి నుజ్జయిన బైక్

ఎంవీపీకాలనీ: జాతీయ రహదారిపై వెంకోజీపాలెం దరి ఆంజనేయ స్వామి ఆలయం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఫిషింగ్ హార్బర్‌కు చెందిన పిల్లా నూకమ్మకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు పిల్లా పైడిరాజు(24) చేపల వేటకు వెళ్తుంటాడు. ఈ నెల 28న భీమిలిలో నూకాలమ్మ పండగ సందర్భంగా పైడిరాజు, అతడి స్నేహితుడు పిల్లా చంటితో కలిసి అక్కడికి వెళ్లాడు. రాత్రంతా సరదాగా గడిపి భీమిలి నుంచి బైక్‌పై వస్తుండగా.. 29వ తేదీ తెల్లవారుజాము 2.30 గంటల సమయంలో వెంకోజీపాలెం ఆంజనేయ స్వామి ఆలయ సమీపంలో హైవేపై డివైడర్‌ను ఢీకొట్టారు. ఈ సమయంలో చంటి వాహనం నడపుతుండగా పైడిరాజు వెనుక కూర్చున్నాడు. నిర్లక్ష్యంగా వాహనం నడపడం, అతివేగంగా కారణంగా డివైడర్‌ను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. పైడిరాజు అక్కడికక్కడే మృతి చెందగా.. తీవ్రగాయాలైన చంటిని కేజీహెచ్‌కు తరలించారు. ఈ ఘటనలో ఏపీ39 ఆర్‌జీ 5980 యమహా ఎంటీ బైక్ నుజ్జునుజ్జయ్యింది. ప్రస్తుతం చంటి ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు ఎంవీపీ పోలీసులు తెలిపారు. పైడిరాజు తల్లి నూకమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం.శ్రీనివాసరావు తెలిపారు.

ఎల్పీజీ నిరంతర సరఫరాకు చర్యలు

బీచ్‌రోడ్డు: వినియోగదారులకు ఎల్పీజీ సరఫరా నిరంతరం కొనసాగించేందుకు తగిన చర్యలు తీసుకున్నట్లు ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు హెచ్‌పీసీఎల్, ఐఓసీఎల్, బీపీసీఎల్‌లు సంయుక్తంగా ప్రకటించాయి. సదరన్ రీజియన్ బల్క్ ఎల్పీజీ ట్రాన్స్‌పోర్ట్ ఓనర్స్ అసోసియేషన్ సమ్మె నేపథ్యంలో వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నాయి. ఇటీవల జరిగిన రవాణా టెండర్లలోని కొన్ని నిబంధనలను తొలగించాలని కొంత మంది బల్క్ ఎల్పీజీ రవాణాదారులు సమ్మె చేస్తున్నారని తెలిపాయి. ఈ నేపథ్యంలో ఎల్పీజీ సరఫరాకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నాయి.

ఆకర్షణీయం.. ఆహ్లాదభరితం

ముడసర్లోవలో జీవీఎంసీ పిల్లల పార్క్ నిర్మాణం



ముడసర్లోవ పిల్లల పార్క్ వద్ద నిర్మిస్తున్న ముఖద్వారం

ఆరిలోవ: ముడసర్లోవ ప్రాంతంలో జీవీఎంసీ పిల్లల పార్క్ అందుబాటులోకి రానుంది. చుట్టూ కొండలు, విశాలమైన బీఆర్‌టీఎస్ రహదారితో కూడిన ఎంతో ఆహ్లాదకరమైన ఈ ప్రాంతంలో అధికారులు పిల్లల పార్క్ నిర్మిస్తున్నారు. సుమారు ఆరెకరాల విస్తీర్ణంలో దీని నిర్మాణం జరుగుతోంది. 2023 అక్టోబర్‌లో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నగరంలోనే ఆకర్షణీయంగా.. ఆహ్లాదభరితంగా పిల్లల పార్క్ నిర్మించదలచింది. ఇందులో భాగంగా మేయర్ గొలగాని హరివెంకటకుమారి సూచనలతో అప్పటి జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ ఈ పార్క్ నిర్మాణానికి రూ.3.50 కోట్లు నిధులు కేటాయించారు. అప్పటి నుంచి పార్క్ పనులు చకచకా జరుగుతున్నాయి. ఇక్కడున్న వందల కొలది వివిధ రకాల చెట్లు, పచ్చదనం నాశనం కాకుండా వాటి మధ్యలోనే వాకింగ్ ట్రాక్‌లు, ఆట పరికరాల ఏర్పాటు, ఉద్యానవన నిర్మాణం చేపడుతున్నారు. పార్క్ పనులు పూర్తయితే పిల్లలు, పెద్దలకు వినోదంతోపాటు ఆహ్లాదం అందుబాటులోకి రానుంది. గతంలో ఇక్కడ జీవీఎంసీ నర్సరీ నిర్వహించి వివిధ రకాల మొక్కలను ఉత్పత్తి చేసేది. పిల్లల పార్క్ నిర్మించదలచిన అధికారులు నర్సరీని ముడసర్లోవ రిజర్వాయర్ వెనుకకు తరలించారు. అక్కడ జీవీఎంసీకి చెందిన కొంత స్థలంలో నర్సరీ నిర్మిస్తున్నారు.



పార్క్ లోపల వాకింగ్ ట్రాక్



పార్క్‌లో నిర్మించిన పాత్‌వేలు



ఆట పరికరాల కోసం చెట్ల మధ్య సిద్ధం చేసిన స్థలాలు

- గత ప్రభుత్వంలో పనుల ప్రారంభం
- రూ.3.50 కోట్ల నిధుల కేటాయింపు
- వయసుల వారీగా ఆట పరికరాల ఏర్పాటు
- సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు వేదిక



సాంస్కృతిక కార్యక్రమాల కోసం నిర్మిస్తున్న వేదిక

పార్క్‌లో సౌకర్యాలు

ఈ పార్క్‌లో పిల్లలతోపాటు పెద్దల వినోదం కోసం పలు సౌకర్యాలు ఏర్పాటు చేయడానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. పలు అడ్వంచర్లతోపాటు పిల్లలు, పెద్దల కోసం వివిధ రకాల ఆట పరికరాలు అమర్చాలని తలచారు. వయసును బట్టి ఆట పరికరాలు ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో అడ్వంచర్ల ఏర్పాటును పక్కన పెట్టినట్లు తెలిసింది. ఆట పరికరాలతోపాటు ఉద్యానవనాలు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ కోసం ప్రత్యేకంగా వేదిక, పార్కు లోపల పాత్‌వేలు, రెండు వాకింగ్ ట్రాక్‌లు నిర్మిస్తున్నారు.

ఆహ్లాదం, ఆరోగ్యం, వినోదం

పార్క్‌లోకి టికెట్ తీసుకొని ప్రవేశించే వారి కోసం పలకలతో కూడిన 2 మీటర్ల వెడల్పుతో వాకింగ్ ట్రాక్ నిర్మించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో పార్క్ ఆవరణలోనే ఉచిత ప్రవేశం కల్పించి ప్రధాన ద్వారం బయట నుంచి చుట్టూ మట్టితో కూడిన 3.5 మీటర్ల వెడల్పుతో మరో వాకింగ్ ట్రాక్ నిర్మిస్తున్నారు. దీని ముఖద్వారం ఆకర్షణీయంగా తయారు చేస్తున్నారు. త్వరలోనే ముడసర్లోవ ప్రాంతంలో వినోదం, ఆరోగ్యం, ఆహ్లాదం అందుబాటులోకి రానున్నాయి. పిల్లల కోసం ఇంత పెద్ద పార్కు నిర్మించడం నగరంలోనే ఇదే మొదటిదని జీవీఎంసీ అధికారులు భావిస్తున్నారు.

ఆట పరికరాలు అమర్చాల్సి ఉంది

పిల్లల పార్క్‌ను ఆకర్షణీయంగా తయారు చేయడానికి అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. ఇప్పటికే సివిల్ వర్క్ 90 శాతం వరకు పూర్తయింది. పార్కు లోపల పాత్‌వేలు సిద్ధమయ్యాయి. వాకింగ్ ట్రాక్ నిర్మాణం పూర్తయింది. ఆట పరికరాల ఏర్పాటుకు వయసుల వారీగా స్థలాలు చదును చేసి సిద్ధం చేశాం. కొద్ది రోజుల్లో సాంస్కృతిక కార్యక్రమాల వేదిక, ముఖద్వారం పనులు పూర్తవుతాయి.

– వెంకటరావు, ఏఈ, జీవీఎంసీ

స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకుందాం



సిటీ బస్‌లో ప్రయాణికులకు కరపత్రాలు అందిస్తున్న సీఐటీయూ నాయకులు

ఆరిలోవ: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని కోరుతూ సీఐటీయూ నాయకులు శనివారం ఆరిలోవ ప్రాంతంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఆరిలోవలో పలు చోట్ల బస్ స్టాప్‌లు, ఆటోలు, సిటీ బస్‌ల్లో ప్రయాణికులకు కరపత్రాలు అందజేశారు. తోటగరువు వద్ద ప్లకార్డులు ప్రదర్శించి, స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు గనులు కేటాయించాలని, కాంట్రాక్ట్ కార్మికులను కొనసాగించాలని, కార్మిక ఉద్యోగులకు బకాయి పడిన జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వీటి కోసం ఏప్రిల్ 1న జీవీఎంసీ కార్యాలయం ఎదురుగా గాంధీ పార్కు వద్ద భారీ ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు సహకరించి ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అందరం కలిసి స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకోవాలన్నారు. సీఐటీయూ నాయకుడు పి.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఫ్లాష్‌మాబ్



ఫ్లాష్‌మాబ్ ప్రదర్శనలో కళాశాల విద్యార్థులు

ఎంవీపీకాలనీ: స్థానిక సమత డిగ్రీ, పీజీ కళాశాల వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఎంవీపీ కాలనీ ఏఎస్ రాజా మైదానం వేదికగా కళాశాల విద్యార్థులు మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహనలో భాగంగా ప్రదర్శించిన ఫ్లాష్‌మాబ్ ఆకట్టుకుంది. అనంతరం జరిగిన వార్షికోత్సవంలో ముఖ్య అతిథులు కళాశాల కరస్పాండెంట్ ఆచార్య విజయ రవీంద్ర, అశ్వర్‌దాస్ విద్యా సంస్థల కార్యదర్శి డాక్టర్ సుంకరి రవీంద్ర తదితరులు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం డాక్టర్ సుంకరి రవీంద్రను సత్కరించారు. విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జాతీయ నాటకోత్సవాలు

మద్దిలపాలెం: స్థానిక కళాభారతి ఆడిటోరియంలో మూడు రోజులుగా నిర్వహించిన విశాఖ జాతీయ నాటకోత్సవాలు శనివారంతో ఘనంగా ముగిశాయి. చివరి రోజు మలయాళ నాటకం ద టైగర్ మ్యాన్‌ను ముఖ్య అతిథులు డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ మాట్లాడుతూ మహాకవి గురజాడ రాసిన కన్యాశుల్కం సమాజాన్ని జాగృతం చేసిందన్నారు. కళలు, నాటకాలను ప్రోత్సహించడానికి రైటర్స్ అకాడమీని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే గంటా మాట్లాడుతూ విశాఖలో జాతీయ నాటకోత్సవాలు నిర్వహించి, సామాజిక సమస్యలపై స్పందించడం ప్రశంసనీయమన్నారు. ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ ఇటీవల అసెంబ్లీలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో మంత్రి కందుల దుర్గేష్, రఘురామ కృష్ణంరాజులు నటనతో మెప్పించి కళల ప్రాధాన్యాన్ని తెలియజేశారన్నారు. రైటర్స్ అకాడమీ చైర్మన్ వి.వి.రమణమూర్తి, ప్రముఖులు నాంచారయ్య, చలసాని కృష్ణప్రసాద్, ఫణి స్వామి, కె.వెంకటేశ్వరరావు, మేడ మస్తాన్‌రెడ్డి, ఆడిటర్ ఏపీ రమణ తదితరులు పాల్గొన్నారు.



టైగర్ మ్యాన్ నాటకంలోని ఓ సన్నివేశం

ఆలోచింపజేసిన 'ద టైగర్ మ్యాన్'

కేరళకు చెందిన మలయాళ దర్శకులు హిస్నం టోంబో దర్శకత్వం వహించిన 'ద టైగర్ మ్యాన్' నాటకం ప్రేక్షకులను ఆలోచింపజేసింది. గిరిజన గ్రామాల్లోని ప్రజల జీవనాన్ని, పేదరికాన్ని కళ్లకు కట్టినట్లు నటీనటులు ప్రదర్శించారు. 32 మంది కళాకారులు చక్కగా నటించి ప్రేక్షకులను కంటతడి పెట్టించారు.

- లీడర్ జాతీయ నాటకోత్సవాలను పురస్కరించుకుని శనివారం సాయంత్రం కళాభారతి వేదికపై చిన్నారి రియాన్స్ ప్రహ్లాదుని ఏకపాత్రాభినయం ప్రేక్షకులను ఆకట్టుకుంది. సెకండ్ క్లాస్ చదువుతున్న ఏడేళ్ల రియాన్స్ భక్త ప్రహ్లాదుడి పాత్రలో ఓం నమో నారాయణ అంటూ ఆలపించిన గానం నాటి భక్తప్రహ్లాద చిత్రాన్ని గుర్తుచేసింది.

ఘనంగా నూకాలమ్మ పండగ



అమ్మవారి దర్శనం కోసం క్యూ లైన్లలో భక్తులు

ఆరిలోవ: జీవీఎంసీ 11వ వార్డు పాత ఆరిలోవలో నూకాలమ్మ పండగ శనివారం ఘనంగా జరిగింది. భక్తుల తాకిడితో ఈ ప్రాంతం సందడిగా మారింది. ఆరిలోవ ప్రాంతానికి నూకాలమ్మ గుడి ఇదొక్కటే కావడంతో ఆరిలోవ కాలనీ నుంచి దుర్గాబజార్, లీలాసుందరి నగర్, నెహ్రూనగర్, టీఐసీ పాయింట్, అంబేడ్కర్ నగర్, బాలాజీనగర్, తోటగరువు తదితర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు వేకువజాము నుంచి సాయంత్రం వరకు క్యూ లైన్లో గంటల తరబడి నిరీక్షించి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. మేయర్ గొలగాని హరివెంకటకుమారి, వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్ నూకాలమ్మను దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కమిటీ ఏర్పాటు చేసిన ప్రసాదాన్ని భక్తులకు మేయర్ పంపిణీ చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



నూకాలమ్మను దర్శించుకుంటున్న మేయర్ గొలగాని హరివెంకటకుమారి

- 11వ వార్డు జాతీయ రహదారిని ఆనుకొని రూరల్ తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా నూకాలమ్మ పండగ ఘనంగా జరిగింది. ఇందిరానగర్, వెటర్నరీ కాలనీ, డెయిరీఫారం, ఆదర్శనగర్ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

13వ వార్డు టీడీపీలో మరో కుంపటి





- ఎవరికి వారే అన్న చందంగా కూటమి పార్టీల నాయకులు
- టీడీపీలో చేరిన కార్పొరేటర్‌ను పట్టించుకోని శ్రేణులు
- టీడీపీ ఆవిర్భావ దినోత్సవంలో బయటపడిన వైనం

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు టీడీపీలో మరో కుంపటి ఏర్పడింది. టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం అది బయటపడింది. వార్డులో పార్టీ ఆవిర్భావ వేడుకలు వేర్వేరుగా నిర్వహించారు. ఇప్పటికే ఈ వార్డులో కూటమిలోని మూడు పార్టీలు 'ఎవరికి వారే.. యమునా తీరే' అన్న చందంగా మారాయి. ఒకరు చేపట్టిన కార్యక్రమంలో మరో పార్టీ నాయకులు పాల్గొనడం లేదు. ముగ్గురూ కలిసి కూడా ఇంతవరకు ఏ కార్యక్రమం చేపట్టలేదు. దీంతో పేరుకే కూటమిగా ఉన్నప్పటికీ ఎవరి పని వారే చేసుకుంటున్నారు.

ఇదిలా ఉండగా.. ఇప్పుడు వార్డులో ఒక్క టీడీపీలోనే మరో కుంపటి మొదలైంది. వైఎస్సార్‌సీపీని ప్రజలు ఆదరించి కార్పొరేటర్‌గా గెలిపించిన కెల్ల సునీత ఇటీవల టీడీపీ కండువా వేసుకున్నారు. ఆమె టీడీపీలో చేరడంతో వార్డులో ఇంతవరకు ఆ పార్టీ కోసం కష్టపడిన నాయకులకు మింగుడు పడటం లేదు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు స్వలాభం కోసమే వైఎస్సార్‌సీపీలో గెలిచిన కార్పొరేటర్‌ను తెచ్చిపెట్టుకున్నారని, పార్టీ కోసం కష్టపడి పనిచేసిన నాయకులను పక్కన పెడుతున్నారంటూ వారు రగిలిపోతున్నారు. ఆ కార్పొరేటర్ పార్టీలో చేరడం ఇష్టం లేని టీడీపీ నాయకులు వార్డు అధ్యక్షుడు పొత్రకొండ ధర్మారావు ఆధ్వర్యంలో శనివారం టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని దుర్గానగర్, పైనాపిల్ కాలనీ, రామకృష్ణాపురం ప్రాంతాల్లో ఎన్టీఆర్ విగ్రహాల వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ వార్డు కమిటీ నాయకులు మజ్జి రమణి, తురకపూడి బాలస్వామి, ప్రసాద్, సుధాకర్, ఆయా ప్రాంతాల్లోని పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. కొత్తగా పార్టీలో చేరిన కార్పొరేటర్‌ను కనీసం ఆహ్వానించకపోవడం వారిలో ఉన్న అసంతృప్తికి నిదర్శనం. దీంతో కార్పొరేటర్ కెల్ల సునీత, ఆమె భర్త సత్యనారాయణ, మరో ఆరుగురు కార్యకర్తలతో కలిసి వేరుగా ఆమె కార్యాలయంలో ఎన్టీ రామారావు చిత్రపటానికి నివాళులర్పించారు.

క్యాడర్ లేదు.. ఆదరణ కరవు

టీడీపీలో చేరిన తనకు వార్డులో స్థానిక కూటమి నాయకులు సహకరించడం లేదంటూ సదరు కార్పొరేటర్ మదనపడుతున్నట్లు తెలిసింది. గతంలో వైఎస్సార్‌సీపీలో ఉన్నప్పుడు ఏ కార్యక్రమం చేపట్టినా పదుల సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు ఇప్పుడు ఆమె వెంట లేకపోవడం విశేషం. పార్టీని వీడటంతో అటు వైఎస్సార్‌సీపీ నాయకులను కోల్పోవడమే కాకుండా ఇటు టీడీపీ నాయకులు ఆదరించడం లేదంటూ 13వ వార్డు కార్పొరేటర్ ఆవేదన చెందుతున్నట్లు సమాచారం.



గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

సీతమ్మధార: గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తరలిస్తున్న ఓ వ్యక్తిని ద్వారకా పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ తెలిపిన వివరాలిలా.. కడపకు చెందిన సురేష్‌రెడ్డి అదే ప్రాంతానికి చెందిన నాగేశ్వరరెడ్డికి అల్లూరి జిల్లాలోని కొయ్యూరుకు చెందిన నరేంద్ర ద్వారా నాలుగు కిలోల గంజాయి కొనుగోలు చేసి సురేష్‌రెడ్డి వద్దకు చేర్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఈ క్రమంలో గంజాయితో ద్వారకానగర్ ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా గల తాజ్ హోటల్లో ఉన్నట్లు సమాచారంతో ద్వారకా సీఐ డి.వి.రమణ పర్యవేక్షణలో సిబ్బంది తనిఖీలు చేశారు. బ్యాగులో గంజాయి ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకొని వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.





ఎంవీపీ రైతుబజార్ కిటకిట

ఎంవీపీకాలనీ: ఉగాది పండగను పురస్కరించుకుని శనివారం ఎంవీపీ రైతుబజార్ కిటకిటలాడింది. ఆదివారం ఉగాది పర్వదినం కావడంతో పూజా సామగ్రి కొనేందుకు వినియోగదారులు పోటెత్తారు. ఉదయం నుంచి రాత్రి వరకు రైతుబజార్‌లో రద్దీ కొనసాగింది. ఉగాది పూజలో అన్ని రకాల పూలు, ప్రతులు, గ్రామీణ ఉత్పత్తులను వినియోగించే విషయం తెలిసిందే. దీంతో వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా పూజా సామగ్రిని రైతులు భారీ ఎత్తున రైతుబజార్‌కు తీసుకొచ్చారు. కొబ్బరికాయలు, వేప పువ్వు, అరటి పండ్లు, మామిడి కాయలు అనేక మంది రైతులు భారీ ఎత్తున విక్రయించారు. వివిధ రకాల పువ్వులు, పూల దండలు, బెల్లం విక్రయాలు సైతం జోరుగా సాగాయి. పూల ధరలు అధికంగా ఉన్నా.. పండగ దృష్ట్యా జనం పెద్ద ఎత్తున కొనుగోలు చేశారు. వినియోగదారులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా రైతుబజార్ అధికారులు ఏర్పాట్లు చేశారు.



ఎంవీపీ రైతుబజార్‌లో వినియోగదారులు